సాక్షి అనంతపురం

ఆదివారం । 3 । మార్చి । 2024

I



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/16.9°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పలు చోట్ల వేకువజామున చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మద్దతు ధరతో పంట ఉత్పత్తుల కొనుగోలు



వేరుశనగ



పప్పుశనగ

అనంతపురం అగ్రికల్చర్: రబీలో రైతులు పండించిన వేరుశనగ, పప్పుశనగను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకే వేదికగా వేరుశనగ క్వింటా రూ.6,337 ప్రకారం, పప్పుశనగ క్వింటా రూ.5,440 ప్రకారం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. సకాలంలో చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు ఆర్‌బీకే అసిస్టెంట్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపు వీఏహెచ్‌ఏలకు నియామక ఉత్తర్వులు



జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ) పోస్టులకు ఎంపికైన వారికి సోమవారం కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జేడీలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్ శనివారం తెలిపారు. 439 మందికి ప్లేస్‌మెంట్లు కూడా ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. నియామక పత్రాలు తీసుకున్న తర్వాత 15 రోజుల్లోపు విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ కొలువులు దక్కనుండటంతో వందలాది మంది వీఏహెచ్‌ఏ అభ్యర్థులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసరాల ధరలు పెరగకుండా చూడాలి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: బియ్యం, పప్పు దినుసులు, కూరగాయలు తదితర నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మార్కెట్‌పై నిరంతర పర్యవేక్షణ ఉన్నప్పుడే ధరల్ని అదుపు చేయగలమన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు తదితర వాటి ధరల్లో వచ్చిన మార్పులను, మార్కెట్‌లోని ధరలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి కంటే మించి నిల్వ చేయకూడదన్నారు. పౌర సరఫరాలు, విజిలెన్స్, వాణిజ్య పన్నులు, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా వాణిజ్య సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సరుకులు అధిక ధరలకు విక్రయిస్తున్న, పరిమితికి మించి సరుకు నిల్వ ఉంచిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో అధికారులు తమ పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి ధరల నియంత్రణ, పరిమితికి మించి సరుకు నిల్వ తదితర అంశాల గురించి తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో డీఎస్‌ఓ శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలో నిర్మించిన సచివాలయం



అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో రైతు భరోసా కేంద్రం



అనంతపురంలోని రాజీవ్‌కాలనీలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

గ్రామ స్వరాజ్యం సాకారం

ఊరూరా ప్రభుత్వ ఆస్తులు

- సచివాలయాలతో గ్రామాల్లోనే సమస్యలకు చెక్
- రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు అభయం
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో ప్రాథమిక వైద్యానికి జీవం
- పాలన కొత్త పుంతలు
- ప్రజలకు భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాకారం చేశారు. ఊరూరా శాశ్వత ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చి ప్రభుత్వ పాలనను కొత్త పుంతలు తొక్కించారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక గ్రామ/వార్డు సచివాలయం ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలు నేరుగా గడప వద్దకే చేర్చారు. అన్నదాతల అవస్థలకు చెక్ పెడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ప్రాథమిక వైద్యానికి జీవం పోశారు. ఒక్కో గ్రామ/వార్డు సచివాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ.20.20 లక్షలు లెక్కన అనంతపురం జిల్లాలో రూ.305 కోట్లు ప్రభుత్వ భవన నిర్మాణాలకే ఖర్చు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.236.84 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు.

కుర్చీలు కూడా లేని రోజుల నుంచి..

గతంలో పాలకులెవరూ ప్రభుత్వ భవనాల గురించి ఆలోచన కూడా చేయలేదు. అధ్వాన స్థితికి చేరినా మార్చిన దాఖలాలు లేవు. టీడీపీ హయాంలో అయితే పరిస్థితి ఘోరంగా ఉండేది. ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులు ఎన్నో సార్లు మొరపెట్టుకున్నా చంద్రబాబు పట్టించుకోలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు కూలిపోయే దశకు చేరినా మరమ్మతులు చేయలేదు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఏఎన్‌ఎంలకు కుర్చీలు కూడా ఉండేవి కాదు. ఈ దశలోనే సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ పాలన స్వరూపాన్నే మార్చివేశారు. ప్రజా సమస్యలకు వారి చెంతనే పరిష్కారం లభించేలా చర్యలు తీసుకున్నారు.



ప్రజల సౌకర్యార్థం శెట్టూరు మండలం కైరేవులో ఒకే చోట నిర్మించిన ప్రభుత్వ భవనాలు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ భవనాలు ఇలా

అనంతపురం..	
గ్రామ/వార్డు సచివాలయాలు	430
నిర్మాణం పూర్తయినవి	341
ప్రారంభించినవి	289
రైతు భరోసా కేంద్రాలు	362
నిర్మాణం పూర్తయినవి	294
ప్రారంభించినవి	241
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	268
నిర్మాణం పూర్తయినవి	196
ప్రారంభించినవి	151

శ్రీ సత్యసాయి..	
గ్రామ/వార్డు సచివాలయాలు	351
నిర్మాణం పూర్తయినవి	186
ప్రారంభించినవి	108
రైతు భరోసా కేంద్రాలు	271
నిర్మాణం పూర్తయినవి	169
ప్రారంభించినవి	97
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	185
నిర్మాణం పూర్తయినవి	95
ప్రారంభించినవి	43

అనంతపురం జిల్లాలో భవనాల నిర్మాణానికి చేసిన ఖర్చు

కేటగిరీ	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
గ్రామ/వార్డు సచివాలయాలు	430	172
రైతు భరోసా కేంద్రాలు	362	78.91
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్	268	54.13

శ్రీ సత్యసాయి జిల్లాలో..

కేటగిరీ	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
గ్రామ/వార్డు సచివాలయాలు	351	140.40
రైతు భరోసా కేంద్రాలు	271	59.07
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్	185	37.37

ఆర్‌బీకేలతో అవస్థలు తప్పాయి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అండగా ఉంటున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఎంతో మేలు చేశారు. గతంలో వేరుశనగ విత్తనాల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. అవస్థలు పడుతూ గ్రామాల్లోకి తరలించాల్సి వచ్చేది. నేడు రైతు భరోసా కేంద్రంలోనే విత్తనాలు, ఎరువులు అందిస్తుండడంతో బాధలు తప్పాయి. అధికారులు కూడా రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సూచనలు అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పంట నష్ట పరిహారం కచ్చితంగా అందుతున్నాయి. **– నాగరాజు, పి.జలాలపురం, శింగనమల మండలం**

గతంలో ఎవరూ పట్టించుకోలేదు



ఒకప్పుడు ఏదైనా కావాలంటే శెట్టూరు మండలకేంద్రానికి వెళ్లేవాళ్లం. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుణ్యమా అని మా ఊరిలోనే సచివాలయంతో పాటు ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కట్టించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు గ్రామంలోనే తీసుకుంటున్నాము. ఏ చిన్న రోగం వచ్చినా క్లినిక్‌లోని డాక్టరుతో చూపించుకుంటున్నాం. గతంలో ఎవరూ ఇంతలా ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదు.
–ముక్కన్న, కైరేవు, శెట్టూరు మండలం

ఊరిలోనే వైద్య సేవలు



గతంలో ఆరోగ్య ఉప కేంద్రమున్నా పక్కా భవనం అనేది లేదు. సిబ్బంది కూడా సరిగా పని చేసే వారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మా గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్నారు. గతంలో వైద్య సేవల కోసం కణేకల్లుకు వెళ్లే వాళ్లం. ఇప్పుడా సమస్యలేదు. మా ఊళ్లోనే వైద్య సిబ్బంది ఉన్నారు. అవసరం బట్టి డాక్టర్లు కూడా వచ్చి సేవలందిస్తున్నారు.
– నాగేంద్రరెడ్డి, బెణికల్లు, కణేకల్లు మండలం

అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మన్‌గా వెన్నపూస రామచంద్రారెడ్డి



అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ సలహా మండలి (అగ్రి అడ్వయిజరీ బోర్డు) జిల్లా చైర్మన్‌గా వెన్నపూస రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లా చైర్మన్‌గా ఉన్న టి.రాజశేఖరరెడ్డి మరణించిన విషయం తెలిసిందే. దీంతో నార్పల మండలానికి చెందిన వెన్నపూస రామచంద్రారెడ్డిని నియమించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. తనను గుర్తించి పదవిని అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో జిల్లా రైతులకు మేలు చేస్తానన్నారు.

విహార యాత్రలో విషాదం

- సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు



కుందనకోట పెద్దిరాజులు (ఫైల్)



అప్పేచెర్ల శేషారెడ్డి (ఫైల్)

యాడికి: విహార యాత్రలో విషాదం చోటుచేసుకుంది. అంత వరకూ ఆనందంగా గడిపిన వారిలో ఆవేదన నింపింది. వివరాలు.. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పెద్దిరాజులు, పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు శేషారెడ్డి స్థానిక పెన్నా సిమెంట్ కర్మాగారం కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. రెండు రోజుల క్రితం తమ స్నేహితులు 22 మందితో పాటు పాటు నలుగురు అధ్యాపకులతో కలిసి తమిళనాడు రాష్ట్రంలోని మహాబలిపురానికి విహారయాత్రకు వెళ్లారు. శనివారం ఒడ్డున నిలబడి సముద్రాన్ని చూస్తుండగా, రాకాసి అల వచ్చి వీరిని సముద్రంలోకి లాక్కెళ్లింది. వెంటనే అప్రమత్తమైన తోటి స్నేహితులు, అధ్యాపకులు స్థానిక జాలర్లకు సమాచారం చేరవేశారు. వారు వచ్చి వెతికినా ఇద్దరి ఆచూకీ లభ్యం కాలేదు. తమ కుమారులు సముద్రంలో గల్లంతయ్యారనే సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం రాత్రి మహాబలిపురానికి తరలి వెళ్లారు. ఈ క్రమంలోనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాడికి సీఐ రోషన్, పోలీసు సిబ్బంది పెన్నా సిమెంటు కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

జన హితం మరచి.. రచ్చ‘జేసీ’

- పెన్నానదిలో మరమ్మతు పనులు అడ్డుకున్న జేసీ ప్రభాకర్ రెడ్డి
- ప్రజలు ప్రశ్నించడంతో జారుకున్న వైనం



పెన్నా నదిలో జరుగుతున్న మరమ్మతు పనులను అడ్డుకునేందుకు తన అనుచరులతో కలిసి వస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి బుద్ధి మారడం లేదు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేక అభివృద్ధికి అడుగడుగునా అడ్డు పడుతున్నారు. ప్రజలు ఏమైతేనేం.. నా ఆట నాదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా శనివారం కూడా ఇష్టారీతిన వ్యవహరించి జనం ముందు నవ్వులపాలయ్యారు. వివరాలు.. వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు చూపుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చర్యలు తీసుకున్నారు. ఇటీవల మున్సిపల్ తాగు నీటి సరఫరా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిరుపయోగంగా ఉన్న పలు బోర్లు, పైపులు, విద్యుత్ వైర్లు, వాటికి అదనంగా కొంత సామగ్రి కొనుగోలు చేసి, మరమ్మతులు చేయిస్తే పూర్తి స్థాయిలో వేసవి మొత్తం తాగు నీరు సరఫరా చేయగలమని అధికారులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు రూ. 8 లక్షలు ఖర్చవుతుందని వివరించారు. దీంతో ఆ మొత్తాన్ని భరించేందుకు ఎమ్మెల్యే సిద్ధపడ్డారు. ఎమ్మెల్యే అందించిన సహకారంతో అధికారులు 3 రోజులుగా సమీపంలోని పెన్నా నదిలో పనులను చేపడుతున్నారు. దీన్ని జీర్ణించుకోలేని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి శనివారం అక్కడకు చేరుకుని నానా రభస చేశారు. టీడీపీ కౌన్సిలర్లు, తన అనుయాయులతో కలిసి పనులు అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలోనే పలువురు స్థానికులు టీడీపీ నాయకులపై తిరగబడ్డారు. తమ హితం కోరి పనులు చేపడుతున్నారన్నారు. ఇన్ని రోజులు మీరు ఏం చేశారని ప్రశ్నించారు. దీంతో చేసేది లేక జేసీ అక్కడి నుంచి జారుకున్నారు.

ఎమ్మెల్యేకు పేరొస్తుందనే అక్కసుతోనే..

తన సొంత నిధులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పనులు చేయిస్తుండడంతో ఆయనకు ప్రజల్లో పేరొస్తుందనే అక్కసుతోనే జేసీ ప్రభాకర్ రెడ్డి పనులు అడ్డుకునేందుకు యత్నించారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. కౌన్సిలర్ రాఘవేంద్ర, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, నాయకులు రవి తేజారెడ్డి, బాబా, గురుశంకర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అడ్డుపడడం జేసీ అండ్ కోకు అలవాటుగా మారిందని మండిపడ్డారు.

జేసీ తీరు దారుణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సొంత నిధులతో బోర్ల మరమ్మతులు చేయిస్తుంటే అడ్డుకోవాలని చూడడం దారుణమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ కౌన్సిలర్ల వల్లే తాడిపత్రిలో మురుగు సమస్యలు నెలకొంటున్నాయన్నారు. కాలువలను పూడ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. వాటిని తమకు అంటగట్టి బురదజల్లేందుకు యత్నిస్తున్నారన్నారు. అమృత్ స్కీం కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ. 63 కోట్లు నిధులు తెస్తే వాటిని మున్సిపల్ కౌన్సిల్‌లో పెట్టకుండా జేసీ ప్రభాకర్ రెడ్డి అడ్డుపడ్డాడన్నారు. ఉదయం లేచినప్పటి నుంచి ప్రజలకు అబద్ధాలు చెబుతూ పబ్బం గడుపుకుంటున్నాడన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మరింత రెచ్చిపోతున్నాడని, ప్రజలే ఇలాంటి వారికి బుద్ధి చెప్పాలని కోరారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, జెడ్పీటీసీ రమణమ్మ, ఆలూరు రామేశ్వరరెడ్డి ఉన్నారు.

ఎస్కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు శుభవార్త

- పదోన్నతులకు పాలకమండలి గ్రీన్‌సిగ్నల్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వర్సిటీ పాలకమండలి శుభవార్త వినిపించింది. పదోన్నతులు కల్పించేందుకు పచ్చజెండా ఊపింది. ఎస్కేయూ పాలకమండలి సమావేశం శనివారం నిర్వహించారు. వర్చువల్‌గా సాగిన సమావేశానికి వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇలా ఉన్నాయి.

- 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద పదోన్నతులు. వీరితో పాటు గతంలో పదోన్నతి దక్కని కంప్యూటర్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సైతం పదోన్నతి.
- ప్రస్తుతం పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు యథావిధిగానే వేతనాల చెల్లింపు.
- సూపరింటెండెంట్ ఎంఏ లక్ష్మణరావు,సుధారాణిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేత
- ప్రొఫెసర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఖేజియారాణిలను వారి మాతృ విభాగాలైన కంప్యూటర్ సైన్సెస్‌కు బదిలీ చేయాలని నిర్ణయం.
- ప్రొఫెసర్ శంకర్ నాయక్‌కు పెన్షన్ ఇవ్వడానికి బిల్లులు సెటిల్ చేయలేదనే అంశంపై అర గంట పాటు చర్చ. ఆయనకు పెన్షన్ ఇవ్వడానికి ఇంకా ఎంత సమయం పడుతుందనే విషయంపై ఉన్నతాధికారులు వివరణ ఇవ్వాలని కోరగా అధికారులు గడువు కోరారు.
- లైబ్రేరియన్ రామసుబ్బయ్యపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేతకు పాలకమండలి సభ్యుల భిన్నాభిప్రాయాలు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే విధులకు గైర్హాజరు కావడం క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుందంటూ, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఇంటర్ ‘ద్వితీయ’ పరీక్షలు ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన లాంగ్వేజస్–2 పరీక్షలో అనంతపురం కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంలో కాపీ కొడుతూ ఒక విద్యార్థి డీబార్ అయ్యాడు. మొత్తం 16,478 మంది (జనరల్) విద్యార్థులకు గాను 16,097 మంది హాజరయ్యారు. 381 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 193 మందికి గాను 1,156 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ మూడు కేంద్రాలు, డీఈసీ సభ్యులు నాలుగు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 8 కేంద్రాలు పరిశీలించారు. రెండు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

బాలింత అనుమానాస్పద మృతి

తాడిపత్రి అర్బన్: ప్రసవమైన 25 రోజుల తర్వాత బాలింత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయిందంటూ బాధిత కుటుంబ సభ్యులు శనివారం తాడిపత్రిలోని ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. అర్బన్ సీఐ మురళీకృష్ణ తెలిపిన మేరకు... పుట్లూరు మండలం కోమటికుంట్లకు చెందిన సుమలత (30) గత నెల ఏడో తేదీన తాడిపత్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవం కోసం చేరింది. ఆడశిశువుకు జన్మనిచ్చిన తర్వాత అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. వైద్యుల సూచన మేరకు సుమలతను భర్త పొట్టిపాటి బాలరంగయ్య బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా ఆమె స్పృహలోకి రాకపోవడంతో తిరిగి తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. డెలివరీ సమయంలో ఆస్పత్రి యాజమాన్య నిర్లక్ష్యం వల్లే సుమలత ఆరోగ్యం దెబ్బతిని మృత్యువాత పడిందంటూ తాడిపత్రిలోని ప్రైవేట్ ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి

గుత్తి: జక్కలచెరువు సమీపంలో గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) కానిస్టేబుల్ మనోహర్ (32)ను మెరుగైన వైద్యం కోసం శనివారం అనంతపురం నుంచి బెంగళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. మృతుడు పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన వ్యక్తి. ఈయనకు భార్య, యేడాది వయసున్న కుమారుడు ఉన్నారు. ఎస్ఐ నబి రసూల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిడ్డ పలికె.. అమ్మ మురిసె

తమ పిల్లలు వినలేరని, మాట్లాడలేరని పుట్టెడు దుఃఖంతో ఉన్న తల్లులకు జగన్ సర్కార్ అండగా నిలుస్తోంది. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.లక్షలు విలువ చేసే శస్త్రచికిత్సలు ఉచితంగా అందించడంతో ఆ అమ్మల మోము మురుస్తోంది. తమ బిడ్డలకు భవిష్యత్ ప్రసాదించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని చెబుతున్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం

- మూగ, చెవిటి పిల్లలకు జగన్ సర్కార్ అండ
- ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు
- ఆరోగ్యశ్రీతో పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు



వినికిడి యంత్రాలను అందిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



అనంతపురం మెడికల్: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆనందానికి అవధులుండవు. కానీ ఆ బిడ్డ అమ్మా అని పిలవకపోతే.. పలకరిస్తే ప్రతిస్పందించకపోతే... ఆ తల్లి పడే ఆవేదన అంతా ఇంతా కాదు. చెవిలోని కాక్లియా సరిగా పనిచేయకపోవడంతో మూగ, చెవిటితో ఇబ్బంది పడుతుంటారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్ ద్వారా వినికిడి ఇబ్బంది తొలగి.. మూగ, చెవిటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స చేయించాలంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అటువంటిది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.లక్షలు విలువ చేసే ఖరీదైన శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తోంది. శస్త్రచికిత్స చేయడంతో పాటు రెండేళ్ల పాటు ఉచితంగా స్పీచ్ థెరపీ కూడా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఉమ్మడి జిల్లాలో 34 శస్త్రచికిత్సలు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 34 మంది చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేశారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.1,63,40,600 ఖర్చు చేసింది. చెవి శస్త్రచికిత్స, స్పీచ్ థెరపీ, పరికరాల అమరిక తదితర వాటికి ఒక్కో చిన్నారికి రూ.8 లక్షల వరకు వెచ్చిస్తోంది.

చిన్నారులకు మెరుగైన వైద్యం

- 3954 మందికి వినికిడి సమస్య గుర్తింపు

వినికిడి సమస్య కల్గిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శనివారం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌లో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు యంత్రాలను అందించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు డీఈఐసీలో 3,954 మంది పిల్లలను పరీక్షించి సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. పుట్టుకతో వినికిడి లోపం ఉన్న 454 మంది పిల్లలను గుర్తించి.. వారిలో 55 మందికి వినికిడి యంత్రాలను ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజర్ రజిత పాల్గొన్నారు.

అమ్మా అని పిలుస్తోంది !



శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల ప్రాంతానికి చెందిన మణి, ధ్రువకుమార్ దంపతులు. వీరి పెద్ద కుమార్తె లాలిత్య (5) పుట్టినప్పటి నుంచి శబ్దం గ్రహించేది కాదు. మాటలు కూడా రావు. అమ్మా అని పిలుపునకు నోచుకోక తల్లడిల్లిపోయిన తల్లిదండ్రులు.. కూతురును కర్ణాటకలోని తుమకూరు, బెంగళూరులోని పలు ఆస్పత్రుల్లో చూపించారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ చేయాలని, అప్పుడే వినికిడి సమస్య పోతుందని, పాప మాట్లాడుతుందని వైద్యులు చెప్పారు. ఇందుకోసం రూ.12 లక్షలు ఖర్చవుతుందన్నారు. అంత డబ్బు సమకూర్చడం ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో ఆరోగ్యశ్రీ గురించి తెలిసింది. ఈ ఏడాది జనవరిలో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి ఉచితంగా ఆపరేషన్ చేయించారు. 'అమ్మా అని పిలుస్తుంటే ఆనందంతో మది పులకించిపోతోంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామ'ని మణి చెబుతోంది.

ఆనందానికి అవధుల్లేవ్

రాప్తాడు మండలం యర్రగుంటకు చెందిన నరసింహారెడ్డి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు సంతానం. రెండో సంతానమైన నాలుగేళ్ల దేవాన్ష్ సింహారెడ్డి వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. రెండేళ్ల వయసులో కాక్లియా సమస్య ఉన్నట్లు బయటపడింది. కుమారుడిని బెంగళూరులోని ఆస్పత్రుల్లో చూపిస్తే చికిత్సకు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. మిత్రులు రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చినా.. మిగిలిన మొత్తం సర్దుబాటు కాలేదు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఉచితంగా చేస్తారన్న సమాచారాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న నరసింహారెడ్డి అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో కుమారుడిని చేర్పించారు. ఆరోగ్యశ్రీ కింద పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు కుమారుడు మాటలు వినడం.. మాట్లాడటం చేస్తుంటే ఆనందానికి అవధులు లేకుండా పోయాయని నరసింహారెడ్డి చెబుతున్నారు.





కుమారుడు దేవాన్ష్ సింహారెడ్డిని చూస్తూ మురిసిపోతున్న తండ్రి నరసింహారెడ్డి

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి స్పెషల్ డ్రైవ్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియను స్పెషల్ డ్రైవ్ ద్వారా రెండు రోజుల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ గౌతమి తెలిపారు. సీఎస్ శనివారం విజయవాడ నుంచి రెవెన్యూ, రీ-సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై సీఎస్‌కు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. జిల్లాకు 5.11 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు రావాల్సి ఉండగా.. ఈవారంలో 1.90 లక్షలు వచ్చాయన్నారు. ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను 3.50 లక్షల మంది లబ్ధిదారులు తమ మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకున్నారని, మిగిలిన వారూ లోడ్ చేసుకునేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లావ్యాప్తంగా 450 రైతు భరోసా కేంద్రాలో కమోడిటీ మానిటరింగ్ యాప్‌లో బయటి మార్కెట్‌లో పంటల ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను రోజూ అప్‌లోడ్ చేయిస్తున్నామన్నారు. జిల్లాలో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఆరోశ్రీ కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ క్రికెట్ విజేత కడప



విజేత జట్లను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: శ్రీ సత్యసాయి జర్నలిస్ట్ క్రికెట్ యూనిటీ కప్-2024 విజేతగా కడప జట్టు నిలిచింది. అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. కడప, వైజాగ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. కడప జట్టు విజేతగా నిలవగా.. వైజాగ్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు ముఖ్య అతిథి కలెక్టర్ గౌతమి ట్రోఫీలు అందజేశారు. అలాగే బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీలను, టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్ల సభ్యులకు మెడల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం సంతోషదాయకమని అన్నారు. పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో అమరావతి హాస్పిటల్ ఎండీ ముత్యాలు, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, నాగభూషణం, రాచమల్లు భోగేశ్వర రెడ్డి,రసూల్ తదితరులతో పాటు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఖాన్, విజయరాజు, షాకీర్, రఘు, శ్రీకాంత్, చక్రి, భీమా, శివప్రసాద్, రవి, సాదిక్, ఈశ్వర్, సాయి, త్యాగరాజు, వాలి పాల్గొన్నారు.


నిండు జీవితానికి రెండు చుక్కలు



ర్యాలీ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం మెడికల్: నిండు జీవితానికి రెండు చుక్కలు అని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. , ఆదివారం చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద అవగాహన ర్యాలీని జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు విధిగా పల్స్ పోలియో చుక్కల మందు వేయించాలని సూచించారు. డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ఆదివారం జిల్లాలో ఏర్పాటు చేసిన 1,785 బూత్‌లలో పోలియో చుక్కల మందు అందిస్తారన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటా సర్వే చేపట్టి పోలియో చుక్కలు వేసుకోని వారికి అదిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, ఓబులు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డాక్టర్ అసోసియేషన్ డాక్టర్ కొండయ్య, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్ పాల్గొన్నారు.

తరిమెల-చిట్టూరు ప్రజల కల సాకారం



బ్రిడ్జిని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

శింగనమల: పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చాక పెన్నానదిపై బ్రిడ్జి నిర్మించడంతో తరిమెల-చిట్టూరు ప్రజల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. రూ.3.50 కోట్ల ఎంపీ నిధులతో నిర్మించిన ఈ బ్రిడ్జిని శనివారం తరిమెల వద్ద పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొన్నారు. తొలుత గ్రామంలోనున్న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెన్నా నది పారితే రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో శింగనమల, పెద్దవడుగూరు మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడిందన్నారు. బ్రిడ్జికి ఇరువైపుల గ్రామాల వరకు సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ, సర్పంచ్ ఓబిలేసు, ఎంపీటీసీ రమేష్, కోటేశ్వర్‌రెడ్డి, బాలిరెడ్డి, కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈఎండీపీ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) ప్రదర్శనలో విద్యార్థులు సత్తాచారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని 9వ తరగతి విద్యార్థుల్లో వ్యాపార మెలకువలు, నూతన ఆవిష్కరణలపై ఉత్పాదక శక్తిని పెంచే క్రమంలో రెండేళ్లుగా ఈఎండీపీ నిర్వహిస్తున్నారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాస రావు, ఈఎండీపీ ప్రాజెక్ట్ అనంతపురం మేనేజర్ పి.గోపాల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రదర్శన జరిగింది. గోనబావి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు గ్లోరీ, చందన, శ్రుతి తయారు చేసిన 'ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల నుంచి తయారు చేసిన 'స్వచ్ఛ భారత్ బ్యాగులు' ప్రాజెక్ట్‌కు ప్రథమ బహుమతి లభించింది. వీరికి హిమబిందు గైడ్ టీచరుగా వ్యవహరించారు. అలాగే నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిచరణ్, రేవంత్ తయారు చేసిన 'అనిమల్ అలర్ట్ అలారమ్' ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ ప్రాజెక్టుకు చంద్రశేఖర్ గైడ్‌టీచరుగా వ్యవహరించారు. ఈ నెల 6న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఈఎండీపీ పోటీల్లో ఈ రెండు ప్రాజెక్టులు పాల్గొంటాయని డీఈఓ వరలక్ష్మి, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ తెలిపారు.

సిబ్బందికి ఎన్నికల విధులు

- డిప్యుటేషన్‌పై నియామకం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ఎన్నికల విధులు అప్పగిస్తూ డిప్యుటేషన్‌పై కలెక్టరేట్, నియోజకవర్గాల ఆర్ఓ కార్యాలయాల్లో నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం జారీ చేశారు.

- డిప్యూటీ తహసీల్దార్లు ఆర్ఎన్ దివాకర్ (సీఎస్ డీటీ, డీఎస్ఓ), డి.రాజా (కలెక్టరేట్ భూపరిపాలన), ఎస్.మారుతీప్రసాద్‌రెడ్డి (అనంతపురం అర్బన్ డీటీ), టి.హరిప్రసాద్ (కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్), ఎం.ప్రభంజన్‌రెడ్డి (కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్), జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనాథ్‌బాబు (కోఆర్డినేషన్ విభాగం)ను కలెక్టరేట్ ఎన్నికల విభాగానికి డిప్యుటేషన్ వేశారు. అదే విధంగా అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం ఆర్ఓ కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దారు జి.సోమశేఖర్ (కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్)ను నియమించారు.

నియోజకవర్గాల్లో నియామకం

- రాయదుర్గం నియోజకవర్గం ఆర్ఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లు బి.రత్నశ్యామ్‌రాయ్, వి.సుజాతదేవి, ఎం.సురేష్‌బాబు, ఎస్.రఘు, సీనియర్ అసిస్టెంట్ పి.గోవిందరెడ్డిని నియమించారు.
- ఉరవకొండ ఆర్ఓ కార్యాలయాయంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డిని నియమించారు.
- గుంతకల్లు ఆర్ఓ కార్యాలయంలో డీటీలు యు.ఆదినారాయణ, పి.సువర్ణ, ఎస్.నిజామ్ (ఎస్ఏ)ను నియమించారు.
- తాడిపత్రి ఆర్ఓ కార్యాలయంలో డీటీలు ఎం.రాజ్‌కుమార్, ఎం.ఆంజనేయప్రసాద్, జి.పవన్ కుమార్, ఎంబీసాయికృష్ణవంశీ (ఎస్ఏ), డేటా ఎంట్రీ ఆపరేటర్లు పి.కలీల్‌బాషా, కె.అరిష్ బాబును నియమించారు.
- శింగనమల ఆర్ఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎల్.కదరిప్ప, ఎం.ఆర్.నరసింహమూర్తిని నియమించారు.
- అనంతపురం అర్బన్ ఆర్ఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు ఎ.మంజూనాథ్‌ను నియమించారు.
- కళ్యాణదుర్గం ఆర్ఓ కార్యాలయ పరిధిలో డీటీలు సి.శ్రీనాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ డి.నాగరాజశేఖర్, డీఈఓ బి.ఖలీల్ బాషాను నియమించారు.
- రాప్తాడు ఆర్ఓ కార్యాలయ పరిధిలో డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.సురేష్‌బాబు, ఎన్.మల్లికార్జున, ఎం.శ్రీనివాసులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ అఖిల్‌తేజను నియమించారు.

పోలీసు కుటుంబాల సంక్షేమమే ధ్యేయం



పోలీసు ఇండోర్ స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఐజీ అమ్మి రెడ్డి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: పోలీసు కుటుంబాల సంక్షేమమే ధ్యేయమని డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతనంగా మౌలిక సదుపాయాల కల్పన చేపట్టారు. ఎస్పీ అన్బురాజన్‌తో కలిసి డీఐజీ వాటిని ప్రారంభించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు బాగుంటేనే పోలీసు వ్యవస్థ బాగుంటుందన్నారు. ఇండోర్ స్టేడియం పై భాగంలో సిమెంట్ రేకులు తొలగించి ఇనుప రేకులు, పెయింటింగ్, లైటింగ్, ప్రాంగణమంతా సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేయించారు. పునరుద్ధరించిన ఇండోర్ స్టేడియాన్ని డీఐజీ ప్రారంభించారు. పోలీసు యూనిట్ ఆస్పత్రి పునరుద్ధరణ పనుల్లో భాగంగా నూతన ట్రెడ్ మిల్ మిషన్, 20 నూతన బెడ్స్, పురుషులకు, మహిళలకు ప్రత్యేక బెడ్స్ కలిగిన ఏసీ వార్డు, లివర్, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్టులు, జాండిస్, హిమోగ్లోబిన్, షుగర్ పరీక్షలు నిర్వహించే పరికరాలు ఏర్పాటు చేశారు. పునరుద్ధరణ చేసిన పోలీసు యూనిట్ ఆస్పత్రిని ప్రారంభించారు. జిల్లా పోలీసు ట్రాన్స్‌పోర్టు విభాగం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఎంటీ ల్యూబ్రికేషన్స్ స్టోర్స్ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీ నారాయణరెడ్డి, డీఎస్పీలు జి.వీరరాఘవరెడ్డి, బివి శివారెడ్డి, జి.మునిరాజా (ఏఆర్), జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, జాఫర్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, తేజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐలుగా పదోన్నతి

అనంతపురం: పలువురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతులు లభించాయి. శ్రీ సత్యసాయి జిల్లా పట్నం పోలీసు స్టేషన్‌లో పనిఏస్తున్న నూర్ మహమ్మద్, హిందూపురం రూరల్‌లో పనిచేస్తున్న నీలవేణిలకు ఏఎస్ఐగా పదోన్నతి దక్కింది. నూర్ మహమ్మద్‌ను కనగానపల్లికి, నీలవేణిని గుంతకల్లు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ అన్బురాజన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు అన్నమయ్య జిల్లాలో పనిచేస్తూ ఇటీవల అనంతపురం ఏఆర్‌కు బదిలీ అయిన ఆర్ఎస్ఐ జాఫర్ పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యుడి హోదాలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

జీతాల పెంపుపై కార్మికుల హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

అనంతపురం రూరల్: శిల్పారామాల్లో పనిచేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి జీతాలు పెంచడంపై అనంతపురం శిల్పారామం కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఏఓ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి శిల్పారామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందిని ఏ ప్రభుత్వాలూ పట్టించుకోలేదన్నారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్న తమకు ముఖ్యమంత్రి జగన్ అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రతి నెలా జీతాలు చెల్లించారన్నారు. రూ.8 వేల నుంచి రూ.13వేలకు జీతం పెంచడంతో పాటు ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్మికులు అనిల్‌కుమార్, ఆది, ఓబిరెడ్డి సర్దానప్ప, ఆశా, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధి పక్కాగా ఉండాలి



నీటిని శుద్ధి చేసే విధానాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నిదియా దేవి

కూడేరు: ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని జెడ్పీ సీఈఓ నిధియా దేవి సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం ఆమె మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టును సందర్శించారు. ఫిల్టర్ బెడ్స్, ఇంటెక్‌వెల్, డ్రా వాటర్, నీటి శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రాజెక్ట్ ద్వారా ఎన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా వుతుంది. నీటి శుద్ధి ఎలా చేస్తున్నారు? వృథా వాటర్‌ను బయటకు ఏ విధంగా పంపుతారని డీఈ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. 900 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు డీఈ వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఈఈ లావణ్య, సూపర్‌వైజర్లు లక్ష్మీరెడ్డి, మంజునాథ్ రెడ్డి, కార్మికులు కొండారెడ్డి, గంగాధర్, నాగరాజు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అనంతపురం: నగరంలో శనివారం రాత్రి 10 గంటలకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. తమిళనాడు నుంచి లోడుతో నగరంలోకి వచ్చిన ఓ లారీ అదుపు తప్పి వృథా బోరు ఎక్కడంతో ఒక్కసారిగా టైరు పగిలి పెద్ద శబ్దం వచ్చింది. దాని దెబ్బకు రోడ్డు పక్కనున్న పెద్ద పెద్ద రాళ్లు, సిమెంట్ ఇటుకలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. అక్కడే ఉన్న హమాలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సూర్యనగర్ రోడ్డు నుంచి సాయినగర్ ఫస్ట్ రోడ్డుకు వెళ్లే మలుపులో జరిగింది. లారీని డ్రైవర్ ఓ పక్కకు తీసుకునే క్రమంలో రోడ్డుపై ప్లాస్టిక్ కవర్లు పడి ఉన్నాయనుకుని లారీని ముందుకు పోనిచ్చాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ హమాలి కూడా ప్రాణాలు కాపాడుకుందామని పరిగెత్తుతుండగా పేలిన టైరు ధాటికి రాళ్లు, ఇటుకలు ఎగిరిపడటంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తరువాత డ్రైవర్ లారీని పక్కకు ఆపేశాడు. ఆ తరువాత విషయం తెలిసి పరుగులు తీసిన వారంతా మళ్లీ అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ హమాలీని ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పగటి పూటో, లేక సాయంత్రమో ఈ ఘటన జరిగి ఉంటే ప్రాణనష్టం భారీగా జరిగి ఉండేదని ప్రజలు చెబుతున్నారు.

మంచి జరిగితేనే ఆశీర్వదించండి



మహిళలకు రిజిస్ట్రేషన్ చేయించిన ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
- 1,003 మంది మహిళలకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సాయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలి. జగనన్న ఉన్నన్ని రోజులూ మహిళల కళ్లల్లో కన్నీళ్లు రాకుండా చూసుకున్నారు. ఇంత భరోసా కల్పిస్తున్న నాయకుడిని మళ్లీ ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలా వ్యాప్తంగా 1,003 మంది మహిళలకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో రాప్తాడులో 25 వేల మెజార్టీతో మీ బిడ్డ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని గెలిపించారు. ఈ సారి కూడా మంచి మనసుతో బంపర్ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో జగనన్న రాష్ట్ర వ్యాప్తంగా అక్క చెల్లెమ్మలకు లక్ష కోట్ల విలువైన ఆస్తులు పంపిణీ చేశారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ఆస్తి పత్రాలు పంపిణీ చేసిందా అని అడగ్గా.. ఏ ప్రభుత్వం ఇవ్వలేదని మహిళలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఆడపడచునూ తన సొంత అక్క చెల్లెమ్మలుగా సీఎం జగన్ భావించారు. అందుకే 31 లక్షల మంది మహిళలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి అందజేస్తున్నారని తెలిపారు. అలాగే 22 లక్షల మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి మహిళల కోసం ఈ స్థాయిలో ఆలోచన చేయలేదన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామంటూ ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోని చంద్రబాబు లాంటి ముఖ్యమంత్రిని చూశాం. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత సమాజంలో గౌరవం పెంచేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇందులో బాగంగానే ప్రతి పథకం మహిళల పేరుతో అమలు చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా పిల్లల చదువులకు 50 లక్షల మంది తల్లుల ఖాతాలో రూ.30 వేల కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. 45 ఏళ్లు దాటిన అక్క చెల్లెమ్మలకు చేయూత పథకం ద్వారా 31 లక్షల మందికి రూ.14 వేల కోట్ల రూపాయలు జమ చేశారన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. బ్యాంకుల్లో డ్వాక్రా రుణాలు ఇచ్చేందుకు పరిమితి పెంచుతున్నారన్నారు. మీ వెనుక జగన్‌మోహన్ రెడ్డి డబ్బులు కడతానే ధైర్యంతో బ్యాంకర్లు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల సంఘం జిల్లా చైర్మన్ పసుపుల నరసింహా గౌడ్, వైఎస్ ఎంపీపీలు బోయ రామాంజినేయులు, మన్నల వరలక్ష్మి, ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కనగానపల్లి మండలంలో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన తూముచెర్ల సర్పంచ్ బంగి మల్లేసు

కనగానపల్లి: కనగానపల్లి మండలంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. దళిత సంఘాల ఉద్యమ నాయకుడు, తూముచెర్ల సర్పంచ్ బంగి మల్లేసు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో శనివారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంఆర్‌పీఎస్ వంటి దళిత సంఘాల్లో ఉద్యమ నాయకుడిగా పని చేసిన బంగి మల్లేసు గత రెండు పర్యాయాలు టీడీపీ తరఫున తూముచెర్ల సర్పంచ్‌గా గెలుపొందారు. కానీ టీడీపీలో సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో పరిటాల కుటుంబానికి దూరంగా ఉంటున్నారు. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు మల్లేసు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోటర్ల రిపేరీతోనే నీటి సమస్య



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- 10వ తేదీ నుంచి యథాస్థితికి నీటి సరఫరా
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 26వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్‌లో మోటర్ల రిపేరీతోనే నీటి సమస్య ఏర్పడింది. నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 26వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. పీఏబీఆర్‌లో ప్రస్తుతం రెండు మోటర్ల ద్వారా పంపింగ్ జరుగుతోందని, అందుకే నీటి సరఫరా కాస్త ఆలస్యమవుతుందన్నారు. మరో మోటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మరో నూతన మోటర్‌ను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10 తేదీ నాటికి నీటి సరఫరా యథాస్థితికి తీసుకువస్తామన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని గుర్తించండి

నాలుగున్నరేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గంలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో రూ.2,304 కోట్లతో సంక్షేమం, రూ.1,045 కోట్లతో అభివద్ధి పనులు చేపట్టామన్నారు. అమ్మ ఒడి రూ.93.39 కోట్లు, విద్యా దీవెన–వసతి దీవెన రూ.73.59 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ.89.98 కోట్లు, వెస్సార్ ఆసరా రూ.77.36 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.403.98 కోట్లు, కాపు నేస్తం రూ.9.77 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.11.78 కోట్లు, సున్నావడ్డీ రూ.16.98 కోట్లు, వైఎస్సార్ బీమా రూ.6.06 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10.04 కోట్లు ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ కరెంటుకు రూ.5.27 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, రూ.311 కోట్లతో అర్బన్ లింక్ రోడ్డు , రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు,ఎన్ క్యాప్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.68.72 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.49.50 కోట్లు, రూ.19 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, రూ.41 కోట్లతో రుద్రంపేట పంచాయితీ, రూ43 కోట్లతో ఏ నారాయణపురంలో, రూ.16 కోట్లతో రాజీవ్ కాలనీలో, రూ.21 కోట్లతో అనంతపురం రూరల్‌లో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎస్ రంగన్న, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, ఎగ్గుల శ్రీనివాసులు, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, కార్పొరేటర్లు మీనాక్షి, కమల్ భూషణ్, ఇసాక్, బాలాంజినేయులు, నాయకులు వి.నాగార్జున రెడ్డి, అలీఖాన్, రామకృష్ణ, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, వలి, షెక్షావలి, లక్ష్మీదేవమ్మ, రమీజ, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, రామయ్య, జానీ, వనారస బలరాం, లింగాల రమేష్, సత్యనారాయణ, అబ్దుల్ బాషా, రఫి, భారతి, పార్వతి, శోభాబాయి, ఉష పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పదోన్నతి పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలతో పాటు ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న ముగ్గురు సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులు (ఏఓలు)గా పదోన్నతి దక్కింది. శనివారం వారికి స్థానిక జెడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పదోన్నతి పత్రాలను అందించారు. శెట్టూరు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్.షబ్బీర్ నియాజ్‌ను జెడ్పీ ఏఓగా నియమించారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రేడ్-1 వీడీఓగా పని చేస్తున్న టి.రమాదేవికి పదోన్నతి కల్పించి తాడిమర్రి మండల పరిషత్ కార్యాలయ ఏఓగా నియమించారు. వజ్రకరూరు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకుడు పి.శ్రీనివాసులును అదే మండల పరిషత్ కార్యాలయ ఏఓగా పదోన్నతిపై నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. విధి నిర్వహణలో మరింత బాధ్యతగా పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ లలితా బాయి, జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు లెక్కల శ్రీనివాసులు, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ఇంజినీర్లతో సమావేశం నిర్వహిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నాం. పీఏబీఆర్‌లో భవిష్యత్తులో మోటర్ల సమస్య రాకుండా రూ.2.50 కోట్లతో రెండు కొత్త మోటర్లను కొనుగోలు చేయనున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నగరపాలక సంస్థలో ఇంజినీర్లతో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నీటి సరఫరా ఏ విధంగా జరుగుతోంది? నీటి ఫోర్స్ వచ్చేలా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ఇంజినీర్లను ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో పంపింగ్ ఆపకూడదని తెలిపారు. నిరంతరంగా ఒక మోటర్ ఆడుతూనే ఉండాలన్నారు. రూ.2 కోట్లతో 760 హెచ్‌పీ మోటర్‌తో పాటు రూ.50 లక్షలతో 500 హెచ్‌పీ మోటర్ కొనుగోలు చేయనున్నట్లు మేయర్ తెలిపారు. రెండ్రోజుల్లో స్టాండింగ్ కమిటీలో వీటిని ఆమోదించనున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరులో జరుగుతున్న మోటరు రిపేరీ పనులకు సంబంధించిన ఫోటోలు(జీపీఎస్) పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా మోటర్ రిపేరీ చేయాలని సంబంధిత కంపెనీ నిర్వాహకులకు సూచించారు. ఈనెల 10వ తేదీ నాటికి నీటి సరఫరా యథాస్థితికి తీసుకొస్తామన్నారు. ఈఈ సూర్యనారాయణ, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు చారిత్రాత్మకం

పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పేదలందిరికీ ఇళ్లు కార్యక్రమం చారిత్రాత్మకం. ఇంటి స్థలం, ఇళ్లు కట్టించడమే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించడం గొప్ప విషయమని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం 32వ డివిజన్ 45వ సచివాలయంలో 162 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో 23 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు అందజేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, శోభాబాయి, గని, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ సూచనలు పాటించాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ సూచనలు, మార్గదర్శకాలు, నిబంధనలను తప్పక పాటించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాకు సంబంధించి అందిన దరఖాస్తుల (ఫారం-6, 7, 8) విచారణ పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, తదితర అంశాలపై కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యల్లో ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. దరఖాస్తులు, 1,500 ఓట్లు మించి ఉన్న పోలింగ్ కేంద్రంలో అగ్జలరీ (అదనపు) పోలింగ్ కేంద్రం ఏర్పాటు, పోలింగ్ కేంద్రం మార్పు, పోలింగ్ కేంద్రం పేరు మార్పు, తదితర అంశాలపై ఈనెల 4వ తేదీన రాజకీయ పార్టీలతో సమావేశం ఉంటుందన్నారు. పోలీసు శాఖతో సంప్రదించి సమస్యాత్మక, గొడవలకు ఆస్కారం ఉండే (వల్నరబుల్) పోలింగ్ కేంద్రాల వివరాలతో కూడిన నివేదిక పంపించాలని ఆదేశించారు. నియోకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీలు, మీడియా సమావేశాన్ని 10వ తేదీలోగా నిర్వహించాలని చెప్పారు.

కేంద్రాల్లో వివరాలు రాయించాలి

పోలింగ్ కేంద్రంలో కేంద్రం సంఖ్య, బూత్‌స్థాయి అధికారి పేరు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి అధికారులు పేర్లను పెయింట్‌తో రాయించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించారు. ఎక్కడైనా కనీస వసతులు లేనట్లు గుర్తిస్తే వెంటనే పనులు చేయించాలని చెప్పారు. ఎన్నికల సమాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లలో చేపట్టిన పనులు పకడ్బందీగా ఉండాలని చెప్పారు. టెలీకాన్ఫరెన్స్‌కు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు జి.వెంకటేష్, రాణీసుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఈడీటీలు, ఎన్నికల సెల్ అధికారులు హాజరయ్యారు.

వ్యాఘ్ర వాహనంపై పరమేశ్వరుడి వైభవం



పార్వతీ పరమేశ్వరులను ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువలా సాగుతున్నాయి. శనివారం రాత్రి పార్వతీ సమేత పరమేశ్వరుడు వ్యాఘ్ర వాహనంపై పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు చంద్ర, తిమ్మారెడ్డి, సుబ్రమణ్యం, వెంకటస్వామి, పరమేష్, అనువంశిక ధర్మకర్త హోసూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఆదర్శం



వలంటీర్లకు వాచ్‌లు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

ఆత్మకూరు: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా పని చేస్తున్న వలంటీర్ల సేవలు ఆదర్శమని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. శనివారం మండల కేంద్రంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గ్రామ వలంటీర్ల సేవలను గుర్తించి వాచ్‌లు సమకూర్చారని తెలిపారు. వీటిని వలంటీర్లకు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా వలంటీర్ల సేవలను గుర్తించి సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. అర్హతను గుర్తించి ప్రతి ఒక్కరికీ పథకాలు అందించారని గుర్తు చేశారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. వలంటీర్లు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి జగనన్న చేసిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, అంజినప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వృద్ధుడి అదృశ్యం

అనంతపురం: త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నారాయణప్ప (70) అనే వృద్ధుడు శుక్రవారం ఉదయం నుంచి కనపడటం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సీఐ ధరణి కిశోర్ తెలిపారు. ఉదయం 7:30 గంటలకు ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లాడని, ఆ తర్వాత ఎంత సేపటికి ఇంటికి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ 9490618679, ఎస్ఐ 9336917115 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యక్తిపై దాడి

అనంతపురం: నగరంలోని నవోదయ కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. నవోదయ కాలనీలో రోడ్డుపై ఉండగా , శనివారం రాత్రి 9 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నాగరాజుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

నేత్రదానం గొప్పది

అనంతపురం కార్పొరేషన్: నేత్రదానం ఎంతో గొప్పదని కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో నగరంలోని నాయక్‌నగర్‌కు చెందిన ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి మరణించగా.. వీరి కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో వారి కళ్లను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి పంపారు. మరణించిన తర్వాత కూడా మరొకరికి చూపు రావాలన్న కోరికతో నేత్రదానం చేయడం గొప్ప విషయమన్నారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయి, సభ్యులు రమేష్, రఘు, కుటుంబీకులు నారాయణ నాయక్ పాల్గొన్నారు.

టైం స్కేలు ఉద్యోగులుగా పరిగణించాలి

అనంతపురం: ఎస్కేయూలో 212 మంది మినిమం స్కేలు ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరందరినీ టైం స్కేలు ఉద్యోగులుగా పరిగణించాలని మినిమం స్కేలు ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో మృతి ఎందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇతర వర్సిటీల్లో అమలు చేస్తున్న తరహాలో ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేస్తున్నారు. సోమవారం లోపు డిమాండ్లు పరిష్కరించకపోతే విధులు బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మినిమం స్కేల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మల్లిరెడ్డి, జనరల్ సెక్రెటరీ మంజునాథ్, అక్కులప్ప, హాస్టల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మారెప్ప, సెక్రెటరీ గోపీ పాల్గొన్నారు.

ఎస్ఐకు గాయాలు

రాప్తాడురూరల్: తిరుపతి జిల్లా ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన వెంకటరమణ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రెండు రోజుల కిందట జరిగిన ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు.. అనంతపురం రూరల్ పీఎస్‌లో ఎస్ఐగా పని చేస్తున్న వెంకటరమణను ఇటీవల ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడు పీఎస్‌కు బదిలీ చేశారు. విధుల్లో భాగంగా ఏర్పేడు పీఎస్ పరిధిలోని పాపానాయుడు పేట వద్ద ఇంటర్ పరీక్ష కేంద్రానికి శుక్రవారం బందోబస్తుకు వెళ్లారు. అక్కడ విధులు ముగించుకుని తిరుపతికి బైక్‌లో బయలుదేరారు. రేణిగుంట దాటిన తర్వాత వెనుకవైపు నుంచి వచ్చిన కంటైనర్ వాహనం ఎస్ఐ బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో బుల్లెట్‌తో పాటు వెంకటరమణ ఎగిరి రోడ్డు పక్కన పడిపోయారు. ప్రమాదంలో కుడి మోకాలికి బలమైన దెబ్బ తగిలింది. మోహం మీద గాయాలయ్యాయి. అతడ్ని తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు.

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు విజయవంతం

అనంతపురం మెడికల్: కిమ్స్–సవీరా ఆస్పత్రిలో 26 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ ఆస్పత్రిలో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని కాక్లియర్ ఇంప్లాంటేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమలోని వివిధ ప్రాంతాల్లోని 26 మంది పిల్లలకు శస్త్రచికిత్సలు చేశారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, అడిప్‌ల ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడం జరిగిందని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మహేష్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ రవిశంకర్, సామాజిక వేత్త తరిమెల అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలపై శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్ పరీక్షలు–2024 నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు శనివారం ఉపాధ్యాయ భవనంలో శిక్షణ నిర్వహించారు. 955 మంది 10వ తరగతి విద్యార్థులకు ఐదు కేంద్రాలు, 2,794 మంది ఇంటర్ విద్యార్థులకు 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. డీఈసీ మెంబర్లు లింగానాయక్, లక్ష్మీనారాయణ, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: బలిజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య కోరారు. శనివారం స్థానిక బాలాజీ కల్యాణ మంటపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో బలిజలకు ఏ పార్టీ కూడా రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బలిజలు అత్యధికంగా ఉన్నారని, రెండు ఎమ్మెల్యే స్థానాలు, ఒక ఎంపీ స్థానం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పాముదురాయి వెంకటేష్, కోనేటి సాయిప్రసాద్, దండు శ్రీనివాసులు, గంగాధర్, మురళీకృష్ణ, లక్ష్మి ప్రసాద్, లింగమయ్య స్వామి, ప్రభాకర్, సురేష్, మనోహర్, మధుసూదన్, పావురాల శేఖర్, నాగేంద్ర ప్రసాద్, రామాంజనేయులు, సుధాకర్, గురుమూర్తి పాల్గొన్నారు.

పంట నమోదు వివరాలు సరి చూసుకోండి

అనంతపురం రూరల్: రూరల్ మండలం ఏ. నారాయణపురం ఆర్‌బీకేలో రబీ పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఏడీఏ రవి మాట్లాడుతూ.. రూరల్ మండల పరిధిలో 880 మంది రైతులు దాదాపు 2,188 ఎకరాల్లో పంటల సాగు చేశారన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 5 లోపు ఫిర్యాదు చేయాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని రుద్రంపేట, తపోవనం, బళ్లారి రోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు, రామ్‌నగర్, లక్ష్మీనగర్, కొవ్వూరు నగర్, 1వ రోడ్డు నుంచి 6వ రోడ్డు వరకూ, ఆజాద్ నగర్, శ్రీనగర్, తదితర ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

వైరల్



మైనస్ 25 డిగ్రీల టెంపరేచర్‌లో... మాంగల్య తంతునానేనా!

సాధారణంగా ఎవరైనా పెళ్లిమండపం ఎంపిక చేసుకోవడానికి సౌకర్యాలు, అనుకూలతలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అయితే అన్ని పెళ్లిళ్లూ ఒకేలా ఉండవు అని చెప్పడానికి ఈ పెళ్లి ఒక ఉదాహరణ. హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితి వ్యాలీలో మైనస్ 25 డిగ్రీల ఉష్ణోగ్రతలో గుజరాతీ జంట పెళ్లి చేసుకుంది. 'ఏ మ్యారేజ్ లైక్ దిస్ టూ! ఏ లవింగ్ కపుల్ ఫ్రమ్ గుజరాత్' క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్‌గా మారింది.

పెళ్లికి వచ్చిన అతిథుల సందడి కూడా వీడియోలో కనిపిస్తుంది. వరుని పక్కన కూర్చోబెట్టుకొని పూలతో అలంకరించిన ఎరుపు రంగు కారును వధువు నడపడంతో వీడియో ముగుస్తుంది.

అయితే ఈ వీడియోను చూసి ప్రశంసించిన వాళ్ల కంటే 'ఓవర్ యాక్టింగ్' అని వెక్కిరించిన వాళ్లే ఎక్కువ.

'మీ పెళ్లి సంబరం సరే, అక్కడ ఎంత చెత్త పేరుకు పోయి ఉంటుందో' అని ఒక యూజర్ స్పందించాడు.

అవమానించిన వాళ్లే అభినందిస్తున్నారు!



'నువ్వేమైనా కలెక్టర్‌వా? డాక్టర్‌వా? లేకపోతే ఏమైనా కంపెనీకి ఓనర్‌వా? ఆఫ్టరాల్... సెక్యూరిటీ గార్డ్‌వి. సెక్యూరిటీ గార్డు కూతురు విదేశాల్లో చదవగలదా?' అని ఆ గార్డు ముఖం మీదే కరుకుగా మాట్లాడారు చాలా మంది. బాధ పెట్టే కామెంట్స్ ఎన్ని చెవిన పడ్డా కూతురిని విదేశాల్లో చదివించాలనే లక్ష్యం విషయంలో ఆయన ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదు. కట్ చేస్తే... యూకే లో ఒక యూనివర్శిటీ నుంచి సెక్యూరిటీ గార్డ్ కూతురు ధనుశ్రీ గైక్వాడ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ధనుశ్రీని ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేయడం, ఆమె తన గ్రాడ్యుయేషన్ డిగ్రీని స్వీకరించడానికి వేదిక పైకి వెళ్లడం, గ్రాడ్యుయేషన్ క్యాప్, గౌన్ ధరించిన ధనుశ్రీ తండ్రిని ఆనందంగా ఆలింగనం చేసుకోవడంలాంటి దృశ్యాలు వీడియోలో కనిపిస్తాయి.

ఆయుష్మాన్ ఖురాన, ఈశా గుప్తాలాంటి బాలీవుడ్ సెలబ్రిటీలు కూడా ఈ వీడియోపై స్పందించారు.

'నువ్వు గార్డువి మాత్రమే. నీ కూతురిని విదేశాల్లో చదివించడం అసాధ్యం' అని తండ్రితో చెప్పిన ప్రతి ఒక్కరికీ వీడియోను షేర్ చేసింది ధనుశ్రీ గైక్వాడ్. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియోకు 20 మిలియన్‌లకు పైగా వ్యూస్ వచ్చాయి.

చిపి చిపీ చాపా... డుబిడుబిడు

వైరల్ ట్రెండ్ క్రియేట్ కావడానికి కొలతలు, ప్రమాణాలు అంటూ ఏవీ ఉండవు. తాజా వీడియో ఇదే విషయాన్ని మళ్లీ గుర్తు తెస్తోంది. అర్థం తెలియని ఒక పదబంధం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది దృష్టిని ఆకర్షించి వైరల్ ట్రెండ్‌గా మారింది.



'చిపి చిపీ చాపా' 'డుబిడుబిడు' అనే పదబంధాలను లయాత్మకంగా పలుకుతూ, ఆకట్టుకునే డ్యాన్స్ స్టెప్స్ వేస్తున్న వీడియోలు ఇంటర్నెట్‌లో వెల్లువెత్తుతున్నాయి.

అసలు ఈ 'చిపి చిపీ చాపా' 'డుబిడుబిడు అనే వింత సౌండ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి అనే విషయానికి వస్తే... జనవరిలో విడుదలైన ఒక ఫిలిప్పినో పాటలోని సౌండ్స్ ఇవి. ట్రెండ్‌ను ఉన్నది ఉన్నట్లు ఫాలో కాకుండా వివిధ రూపాల్లో తమదైన సృజనాత్మకతను జోడిస్తున్నారు క్రియేటర్స్. పవర్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ నుంచి నవ్వు తెప్పించే లిప్ సింక్ వరకు... వారి సృజనాత్మకతకు హద్దులు లేవు. టిక్‌టాక్‌లో పుట్టిన ఈ ట్రెండ్ ఇన్‌స్టాగ్రామ్‌లోకి ప్రవేశించి ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విస్తరించింది.

రణ్‌వీర్ దశావతార్





తమ అభిమాన హీరో బొమ్మ గీసి ముచ్చటపడే అభిమానులు మనకు కొత్తేమీ కాదు. అయితే బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ అభిమాని పామిల్ కత్రి వినూత్న శైలితో తన అభిమానాన్ని చాటుకున్నాడు. రకరకాల స్కెచ్‌లు ఉన్న పరికరంతో కాన్వాస్‌పై ఒకే సమయంలో వివిధ సినిమాలలోని రణ్‌వీర్ క్యారెక్టర్లను గీసి నెటిజనులను ఆశ్చర్యచకితుల్ని చేశాడు. 'మేడ్ 10 స్కెచెస్ ఆఫ్ రణ్‌వీర్‌సింగ్ ఎట్ ఏ సేమ్ టైమ్' క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో ఎనిమిది మిలియన్‌లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ వీడియో చూసి ముచ్చటపడిన రణ్‌వీర్‌సింగ్ పామిల్‌ను ప్రశంసిస్తూ కామెంట్ పెట్టడం మరో విశేషం. ఇక టాలెంటెడ్ ఆర్టిస్ట్ పామిల్ కత్రి విషయానికి వస్తే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన కత్రికి ఇన్‌స్టాగ్రామ్‌లో వందలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు.

నీ సంబడం సంతకెళ్లి పోను



'గుర్రపు స్వారీ' అనే మాట మనకు కొత్తేమీ కాదు. అయితే 'దున్నపోతు స్వారీ' అనే మాట వింటే మాత్రం 'సారీ' అంటాం. 'బుల్ రైడర్ 007' క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో హెల్మెట్ ధరించిన ఒక యువకుడు దున్నపోతుపై కూర్చొని రోడ్డుపై పరుగులు తీస్తుంటాడు. ఆన్‌లైన్ యూజర్‌ల తిట్లు, శాపనార్థాల సంగతి ఎలా ఉన్నా చాలా తక్కువ సమయంలోనే ఈ వీడియో వైరల్ అయింది. 8 మిలియన్‌లకు పైగా వ్యూస్‌ను దక్కించుకుంది

ఈ రైడర్‌తో సెల్ఫీలు దిగడానికి రోడ్డు పక్కన ఉన్న జనాలు పరుగెత్తుకు రావడం మరో వినోద విడ్డూరం.

'నో పెట్రోల్–నో సర్వీస్–నో లైసెన్స్' లాంటి కామెంట్స్‌తో పాటు 'ఇది జంతు హింస తప్ప మరొకటి కాదు' ... లాంటి కామెంట్స్ కనిపించాయి.

ఫ్యామిలీ వ్యాన్ లైఫ్

ఒక ఎస్‌యువి ఉంటే భ్రమణకాంక్ష ఉన్న జీవిత భాగస్వామి దొరికితే ఆ వెహికల్‌నే ఇల్లుగా మార్చుకుని దేశంలోని అందమైన ప్రకృతిని చూస్తూ గడిపేయవచ్చా? చిక్కి, కపిల్ అనే దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ప్రయాణాలకు తగ్గట్టుగా మార్చుకున్న వాహనంలో ఇలాగే తిరుగుతున్నారు. వైరల్ అయిన వారి 'ఫ్యామిలీ వ్యాన్ లైఫ్' గురించి...

తిరిగే వాళ్లు ఎలాగైనా తిరుగుతారు. కాని కొందరు స్పెషల్. సొంతగా క్రెటా, మహీంద్రా 400, ట్రైబర్... లాంటి పెద్ద బండి ఉంటే దానిని కస్టమైజ్డ్ ఇంటీరియర్స్‌తో క్యాంపర్ వ్యాన్‌గా మార్చుకుని కుటుంబం మొత్తం తిరిగే బృందాలు ఇప్పుడు ఇండియాలో పెరిగాయి. క్యాంపర్ వ్యాన్ ఉంటే రిజర్వేషన్లు అక్కర్లేదు. హోటల్ రూమ్‌లు అవసరం లేదు. సమయానికి చేరుకోకపోతే ఫ్లయిట్ మిస్ అవుతామన్న ఆందోళనా లేదు. బండే బస. బండే ప్రయాణ సాధనం.




చిక్కి, కపిల్ అనే దంపతులు తమ ఇద్దరు పిల్లలతో సొంత ఫ్యామిలీ వ్యాన్‌లో దేశమంతా తిరుగుతూ, 'ఘుమ్మక్కడ్ బగ్స్' పేరుతో యూట్యూబ్ చానల్‌లో వీడియోలు పోస్ట్ చేస్తూ పాపులర్ అయ్యారు. వీరికి ఐదు లక్షల మంది ఫాలోయెర్స్ ఉన్నారు. మహీంద్రా 500 వాహనం డిక్కీని వీరు పూర్తి స్థాయి కిచెన్‌గా తయారు చేయించుకున్నారు. లోపలి సీట్లను బెడ్స్‌గా మార్చుకునేలా ఆల్టర్ చేయించారు. ఇవి కాకుండా హాల్ట్ చేసిన చోట బండి మీద టాప్ టెంట్ వేసుకుంటారు. బండికి ఆనుకుని చేంజింగ్ రూమ్ పాలిథిన్ కవర్స్‌తో ఏర్పాటు చేసుకుంటారు. దూరంగా గుంత తవ్వి చుట్టూ పాలిథిన్ కవర్స్‌తో లావెటరీ ఏర్పాటు చేసుకుంటారు. బండిలోనే గ్యాస్, వంట దినుసులు, కూరగాయలు అన్నీ పెట్టుకునే వీలుంటుంది. కపిల్ బండి నడిపితే ఆగిన చోటల్లా చకచకా వంట ముగిస్తుంది చిక్కి. బయటి తిండి వల్ల ఆరోగ్యం పాడవడం ఒక్కటే కాదు.. సమయానికి తిండి దొరక్కపోతే ఇబ్బంది కనుక ఈ ఏర్పాటు. అందుకే వీరు దిగులూ చింతా లేకుండా తిరుగుతూ ఉంటారు. వీరి పాపులారిటీ చూసి మరికొన్ని కుటుంబాలు తమ క్యాంపర్ వ్యాన్‌లతో వీరిని కలుస్తుంటాయి. అందరూ కలిసి గ్రూప్ క్యాంపింగ్ చేసి సరదాగా వొందుకుంటూ, ప్రకృతిని చూస్తూ, అక్కడే నిద్రపోతూ హాయిగా గడిపేస్తుంటారు.

జీవితం అంటే అందమైన ప్రయాణం. చిక్కి, కపిల్ వీడియోల మీద ఆదాయం గడించడమే కాదు... గ్రూప్ క్యాంపింగ్ నిర్వహిస్తూ అలా కూడా డబ్బు గడిస్తున్నారు. టెన్ టు ఫైవ్ ఆఫీసుకు వెళుతూ సంపాదించేవారు ఎక్కువ మంధైతే ఇలా రోజుకో కొత్త ప్రాంతంలో గడుపుతూ సంపాదించడం భిన్నమే కదా.

హెల్త్

మహిళలూ... ఆరోగ్యం జాగ్రత్త!



థైరాయిడ్, మూత్రసంబంధమైన ఇన్ఫెక్షన్స్ లాంటి సమస్యలు మహిళల్లోనే ఎక్కువ. ఇక గుండె జబ్బులు, అవి వ్యక్తమయ్యే తీరు, చికిత్స వంటి అంశాలు మహిళల్లో విభిన్నంగా ఉంటాయి. దీనికితోడు మెనోపాజ్ సంబంధిత సమస్యలూ, సర్వైకల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌లు వంటివి ఎలాగూ పొంచే ఉంటాయి. ఈ నెల 8వ తేదీ 'ఉమెన్స్ డే' సందర్భంగా... గుండెజబ్బులు మొదలుకొని, మహిళల్లోనే ఎక్కువగా కనిపించే కొన్ని ఆరోగ్య సమస్యలపై అవగాహన కోసం...

గుండెజబ్బులు...

ఈస్ట్రోజెన్ హార్మోన్ కారణంగా మహిళల్లో గుండె జబ్బులు, గుండెపోటు లక్షణాలు కాస్తంత వేరుగా ఉంటాయి. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకుంటే మహిళల గుండెజబ్బుల్ని 80 శాతం వరకు నివారించవచ్చు.

ఏం చేస్తుందీ ఈస్ట్రోజెన్...?

మహిళల్లో సక్రమ రుతుక్రమం కోసం ప్రతినెలా విడుదల అయ్యే ఈస్ట్రోజెన్ వారి గుండెకూ, రక్తనాళాలకూ చాలావరకు ఒక సహజ రక్షణగా నిలుస్తుంది. అందుకే మెనోపాజ్‌కు చేరిన వారితో పోలిస్తే... మహిళలకు పీరియడ్స్ వస్తున్న టైమ్‌లో గుండెజబ్బుల ముప్పు తక్కువ. అయితే ఈలోపు వారికి డయాబెటిస్ వచ్చినా లేదా ఏదైనా కారణాలవల్ల గర్భాశయాన్ని, అండాశయాన్ని తొలగించినా... ఆ ముప్పు పెరుగుతుంది.

అలాగే రుతుక్రమం ఆగిన తర్వాత రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ వంటి కొవ్వు పదార్థాల పెరుగుదల, మంచి కొలెస్ట్రాల్ మోతాదులు తగ్గడంతోపాటు రక్తపోటు (హైబీపీ) పెరగడానికి అవకాశాలు ఎక్కువ. ఈ అంశాలు గుండెజబ్బులకు దారితీయవచ్చు. అందుకే రుతుక్రమం ఆగిన మహిళలు తరచూ గుండెజబ్బుల విషయంలో పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్త పడాలి.

మహిళల్లో గుండెపోటు లక్షణాలు ఏ విధంగా భిన్నం..?

మామూలుగా గుండెపోటులో గుండెపై ఒత్తినట్లుగా విపరీతమైన నొప్పి వచ్చి అది మెడ / భుజం / ఎడమ వీపు వైపునకు పాకుతున్నట్లుగా వెళ్లడం మామూలు లక్షణం. కొందరిలో చెమటలు పడుతూ, ఊపిరి తీసుకోవడం కష్టం అవుతుంది. అయితే 50 శాతం మందిలో ఈ లక్షణాలు కాస్త వేరుగా ఉండే అవకాశం ఉంది. ఆ లక్షణాలేమిటంటే... తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ, ఊపిరి అందకపోవడం, అజీర్ణం, పొట్ట పైభాగంలో ఇబ్బంది, దవడలో నొప్పి, గొంతులో నొప్పి, భుజంలో నొప్పి వంటివి.

ఈ జాగ్రత్తలతో నివారణ తేలికే...

- రోజూ కనీసం 30 నిమిషాల చొప్పున వారంలో కనీసం 5 రోజుల పాటు నడక లేదా స్లో జాగింగ్.
- ఆహారంలో తాజా ఆకుకూరలు, తాజా పండ్లు ఎక్కువగానూ, నూనె చాలా పరిమితంగానూ తీసుకోవాలి.
- ఉప్పు కూడా పరిమితంగా తీసుకోవాలి.

యూరినరీ సమస్యలు

మెనోపాజ్ తర్వాత మూత్రంలో ఇన్ఫెక్షన్స్ చాలా సాధారణంగా కనిపించే సమస్యే. నెలసరి ఆగిపోయిన తర్వాత వచ్చే హార్మోన్ల లోపమే దీనికి కారణం. ఈస్ట్రోజెన్ హార్మోన్ లోపం వల్ల మూత్రనాళంలోని ఇంటర్నల్ లైనింగ్‌పొర సన్నబడే అవకాశం ఉంది. ఫలితంగా బ్యాక్టీరియా పేరుకుపోయి, ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతుంది.

ఇవీ మహిళల్లో కనిపించే సాధారణ యూరినరీ ఇన్ఫెక్షన్స్...

మొదటిసారి వచ్చే ఇన్ఫెక్షన్స్ కోసం ప్రత్యేకమైన పరీక్షలేమీ అవసరం లేదు. కానీ మళ్లీ మళ్లీ వస్తుంటే మాత్రం అది ఏ కారణం వల్ల అన్నది తెలుసుకుని, ఆ మేరకు చికిత్స జరగాలి. మొదటిసారి అయితే సాధారణ యాంటీబయాటిక్స్ ఇస్తారుగానీ... మాటిమాటికీ ఇన్ఫెక్షన్లు వస్తుంటే, దానికి తగిన కారణాన్ని కనుగొని, చికిత్స అందించాల్సి ఉంటుంది.

క్యాన్సర్స్...



సర్వైకల్ క్యాన్సర్:... సర్వైకల్ క్యాన్సర్‌ను చాలా ముందుగానే గుర్తించవచ్చు. క్యాన్సర్ వచ్చే ముందు ఉండే లక్షణాలతో దీన్ని పసిగట్టవచ్చు. దాంతో నివారణకూ అవకాశాలు ఎక్కువే. పాప్‌స్మియర్ పరీక్షతో దీన్ని కనుగొనవచ్చు.

వ్యాక్సిన్.. సర్వైకల్ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్ల వస్తుంది. వ్యాక్సిన్ కూడా రూపొందింది. ఇది సర్వైకల్ క్యాన్సర్‌ను దాదాపుగా నివారిస్తుంది.

రొమ్ము క్యాన్సర్.. రక్తసంబంధీకులలో ఈ వ్యాధి వచ్చిన వారు ఉనప్పుడు లేదా తొలిగర్భం ముప్పయి ఏళ్లు దాటాక వచ్చినవారూ, ఐదేళ్లకు పైబడి హార్మోనల్ చికిత్స తీసుకుంటున్నవారిలో రొమ్ముక్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువని తేలింది. ఇలాంటివాళ్లు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా మూడు పరీక్షలు చేయించుకోవాలి.

- మొదటిది ఎవరికి వారే చేసుకునే రొమ్ము పరీక్ష. ప్రతి మహిళా తమ రుతుక్రమం ముగిసిన వారంరోజుల తర్వాత ఎడమ రొమ్మును కుడి చేత్తో, కుడి రొమ్మును ఎడమ చేత్తో తాకుతూ పరీక్ష చేసుకోవాలి. ఏ చిన్న మార్పు గమనించినా వెంటనే డాక్టర్‌ను కలవాలి. రెండోది మామోగ్రఫీ. డాక్టర్ల సూచన మేరకు తరచూ చేయిస్తుండాలి. ఇక మూడోది బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 అనే జన్యు పరీక్షలు. వాటి సాయంతో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను తెలుసుకోవచ్చు. ఓ చిన్న రక్తపరీక్ష ద్వారా దీన్ని కనుక్కోవడం చాలా సులభం.

మెనోపాజ్ విషయంలో జాగ్రత్తలు...

సాధారణంగా అమ్మాయి పదమూడు, పద్నాలుగేళ్ల వయసు రాగానే పీరియడ్స్ సైకిల్ మొదలై, 45 నుంచి 55 ఏళ్ల మధ్యకాలంలో (సగటున 51 ఏళ్లకు) ఆగిపోతాయి. రుతుక్రమం ఆగిపోవడాన్నే ఇంగ్లిష్‌లో మెనోపాజ్ అంటారు.

మెనోపాజ్ ఇబ్బందుల్లో కొన్ని...



- ఒంట్లోంచి వేడి సెగలు, వేడి ఆవిర్లు వస్తున్నట్లు అనిపించడం. ● రాత్రిళ్లు విపరీతంగా చెమటలు పట్టడం. ● యోని పొడిబారడం ● హార్మోన్ల హెచ్చుతగ్గులతో కొందరిలో నిరాశ నిస్పృహలకు లోనుకావడంతో పాటు మరికొందరు ఉద్వేగపూరితంగా మారడం, మూడ్స్ త్వర త్వరగా మారిపోతుండటం... ● కొందరిలో కీళ్ళనొప్పులు, కండరాల్లో నొప్పులు.

మెనోపాజ్ తర్వాత కనిపించే కొన్ని ఆరోగ్య సమస్యలు...

- మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గడంతో గుండెపోటు ముప్పుతోపాటు ఎముకలు పెళుసుబారి బలహీనంగా మారడం ● కొందరిలో మూత్రసంబంధ సమస్యలు, బరువు పెరగడం వంటి సమస్యలు.

సమస్యను అధిగమించడం ఇలా

- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఎత్తుకు తగినట్లుగా బరువును నియంత్రించుకోవాలి. యోగా, ధ్యానం వంటి వాటితో ఉద్వేగాల్లో తీవ్రతలను (మూడ్ స్వింగ్స్‌ను) నియంత్రించుకోవాలి. వేళకు నిద్రపోవాలి. క్యాల్షియమ్ పుష్కలంగా ఉండే పెరుగు, పాల వంటివి తీసుకోవాలి. సూర్యరశ్మికి తగినంత ఎక్స్‌పోజ్ కావడం వల్ల విటమిన్–డి సమకూరి ఎముకల పటుత్వం తగ్గకుండా ఉంటుంది.

మేని మెరుపు కోసం చర్మ సంరక్షణ ఇలా...



ముఖాన్ని శుభ్రం చేసుకోవడం కోసం... సరైన పీహెచ్‌తో ఉన్నదీ, మరీ ఎక్కువ తీవ్రత కూడినది కాకుండా... డర్మటాలజిస్ట్ సూచించిన జంటిల్ ఫేస్ వాష్ లేదా సోప్–ఫ్రీ క్లెన్సింగ్ లోషన్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ● పాదాలు, మోచేతుల్లో పొడి చర్మం ఉన్నవారు చర్మానికి షియాబటర్, కోకోవా బటర్, ప్రొపిలీన్ గ్లైకాల్, గ్లిజరిన్, ఆలో బటర్ వంటి కాంబినేషన్స్‌తో ఉన్న మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఇవి తగినంత తేమ ఉండేలా చూస్తాయి. ● మాయిశ్చరైజర్ రాసుకున్న తర్వాత 40 కంటే ఎక్కువ ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌ను చర్మానికి రాసుకోవాలి. ఇలా ప్రతి రెండు మూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ రాయాలి. ● పిగ్మెంటేషన్ సమస్యలు ఉన్నవారు ప్రతిరోజూ రాత్రి కోజిక్ యాసిడ్, లికోరిక్, టెట్రాహైడ్రోకర్క్యుమిరన్, ఆర్బ్యుటిన్, విటమిన్–సి ఉన్న క్రీములు ప్రతి రోజూ రాత్రివేళ రాసుకోవాలి. ● మొటిమలు ఉన్నవారు క్రమం తప్పకుండా క్లిండామైసిన్ అండ్ ఎడాపలిన్ కాంబినేషన్ ఉన్న క్రీమును రాసుకోవాలి. ● ముఖం మీద నల్లమచ్చలు, ముడతలు వస్తున్నవారు ప్రతిరోజూ రాత్రివేళ విటమిన్–సి, రెటినాల్, హైలురానిక్ యాసిడ్ ఉన్న క్రీములు రాసుకోవాలి. ● జుట్టు రాలిపోతున్నవారు తమకు హార్మోనల్ సమతౌల్యత ఏదైనా ఉందేమోనని తెలుసుకోవాలి. పీసీఓడీ, ఒవేరియన్ సిస్ట్, ఫైబ్రాయిడ్స్ ఉన్నాయేమోనని పరీక్షలు చేసుకోవాలి. ఈ సమస్యలకు పీఆర్‌పీ మంచి పరిష్కారం.



డాక్టర్ భాను ప్రియ,
కన్సల్టెంట్ ఫిజీషియన్

థైరాయిడ్ సమస్యలు



పురుషులతో పోలిస్తే మహిళల్లో థైరాయిడ్ గ్రంథితో వచ్చే సమస్యలు కొంచెం ఎక్కువ. ఇవి ప్రధానంగా రెండు రకాలు. మొదటిది... థైరాయిడ్ గ్రంథి పనిచేయకపోవడం లేదా చాలా తక్కువగా పనిచేయడం వల్ల కలిగే హైపోథైరాయిడిజమ్. రెండోది హైపర్ థైరాయిడిజమ్.

హైపోథైరాయిడిజమ్.. తీవ్రమైన అలసట, డిప్రెషన్, బరువు పెరగడం, చర్మం పొడిగా మారడం, మలబద్ధకం, రుతుక్రమం సక్రమంగా రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. యుక్తవయస్కుల్లో హైపోథైరాయిడిజమ్ వచ్చినప్పుడు సక్రమంగా చికిత్స అందించకపోతే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి హృద్రోగాలకు దారితీయవచ్చు. ఒక్కోసారి మైక్సిడిమా కోమా అన్న కండిషన్‌కు దారితీసి ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశం ఉంది. గర్భిణుల విషయంలో థైరాక్సిన్ పాళ్లు తగ్గుతున్నాయేమో జాగ్రత్తగా గమనించాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన బిడ్డ కోసం ఈ పరీక్షలు చాలా అవసరం.

హైపర్ థైరాయిడిజమ్.. రక్తంలో థైరాయిడ్ హార్మోన్‌లు (టీ3, టీ4) పెరగడం వల్ల వచ్చే సమస్యను హైపర్ థైరాయిడిజమ్ లేదా థైరోటాక్సికోసిస్ అంటారు.

హైపర్‌థైరాయిడిజమ్ లక్షణాలు...

● గుండెదడ, ● చేతులు వణకడం, ● బరువు తగ్గిపోవడం, ● నీరసం, ● విరేచనాలు, ● రుతుక్రమానికి సంబంధించిన సమస్యలు, ● థైరాయిడ్ గ్రంథి వాపు

చికిత్స: యాంటీ థైరాయిడ్ మందులు ఉపయోగిస్తారు. కొన్ని నెలల్లోనే ఈ సమస్య పూర్తిగా తగ్గినా... మళ్లీ థైరాయిడ్ హార్మోన్ స్రావాలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ముందుగా యాంటీ థైరాయిడ్ మందుల ద్వారా హార్మోన్‌ని తగ్గించి, ఆ తర్వాత ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రెండు పద్ధతులు అనుసరిస్తారు. మొదటి దానిలో రేడియో ఆక్టివ్ అయోడిన్ మందును ఎక్కువ మోతాదులో ఇవ్వడం ద్వారా థైరాయిడ్ గ్రంథిలో హార్మోన్ తయారు చేసే కణాలను దెబ్బ తీస్తారు. ఆపరేషన్ ద్వారా థైరాయిడ్ గ్రంథిని తొలగించడం రెండో పద్ధతి అయితే థైరాక్సిన్ మాత్రలు జీవితాంతం వాడాల్సి ఉంటుంది.